క్లుప్తంగా

రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఏవో నాగరాజు

బెజ్జూర్: రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని ఏవో నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పోతపల్లి గ్రామంలో పత్తి పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 60 సెంటీమీటర్ల వర్షపాతం పడిన తర్వాతే పత్తి పంటను విత్తుకోవాలని సూచించారు. ప్రస్తుతం రైతులు పత్తి విత్తనాలు వేయవద్దని పేర్కొన్నారు. పత్తి విత్తనం 3 నుంచి 6 సెం.మీల లోతులో మాత్రమే విత్తుకోవాలని వివరించారు. అనంతరం డీసీఎంఎస్ పోతపల్లి సెంటర్ రికార్డులను పరిశీలించారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని సూచించారు.

చెత్తాచెదారం తొలగింపు



సాయినివాడలో చెత్త తొలగించిన ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధి సాయినివాడలో చెత్తాచెదారం పేరుకుపోగా 'పారిశుధ్య నిర్వహణ కరువు' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజంపేట గ్రామంలో ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ



సావరఖెడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ సంతోష్‌కుమార్

కెరమెరి: మండలంలోని కొఠారి, సావర్‌ఖెడా గ్రామాల్లో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ గ్రామాల్లో ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మిస్సింగ్ ఖాతా నంబర్లు, డీఎస్ పెండింగ్, పేర్లలో మార్పులు చేర్పులు, సర్వే నంబర్లు తప్పులు, విస్తీర్ణం తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. డీటీ సంతోష్‌కుమార్, సిబ్బంది పవన్‌నాయక్, సేవంత, ఇర్షాద్, వసంత్, విజయ్, సురేశ్, బాపూరావు, రాజు, రమేశ్ తదితరులున్నారు.

పీఏసీఎస్‌లో ఎరువుల పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో బుధవారం నుంచి ఎరువులు పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్ ప్రతులతో మొబైల్ తీసుకురావాలని, ఒక ఎకరానికి 2 బస్తాల యూరియా, 1 బస్తా డీఏపీ, లేదా 20 20 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జొన్నల డబ్బులు చెల్లించాలని రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

నార్నూర్: పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నలకు డబ్బులు వెంటనే చెల్లించాలని మంగళవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో రైతులు నిరసనకు దిగారు. మాజీ ఎంపీపీ రూప్‌దేవ్ మాట్లాడుతూ రైతుల వద్ద ప్రభుత్వం జొన్నలు కొనుగోలు చేసి దాదాపు రెండు నెలలు కావస్తున్న డబ్బులు చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి డబ్బులను వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నాగోరావు, రైతులు బాదిరావు, శంకర్ రాథోడ్, గణేశ్, జైవంతరావు ఉన్నారు.

మందుబాబులకు నిలయాలు!



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తాగిపడేసిన మందుసీసాలు



వ్యవసాయ కార్యాలయం వెనుకాల తాగి పడేసిన మందుసీసాలు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు, వ్యవసాయ కార్యాలయాలకు నైట్ వాచ్‌మెన్ లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కరువవడంతో మందుబాబులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో మద్యం సేవించి మందుబాటిళ్లు పడేస్తున్నారు. దీంతో కార్యాలయాలు, కళాశాలకు వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ తిప్పలు

కాగజ్‌నగర్‌టౌన్: ఆధార్ అప్‌డేట్ కోసం కాగజ్‌నగర్ మండలం, పట్టణంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. కాగజ్‌నగర్ పట్టణంలోని పోస్టాఫీసు, పాత పీహెచ్‌సీ భవనంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఉన్నాయి. పోస్టాఫీసులో ఉన్న ఆధార్ కేంద్రంలో ఆపరేటర్ లేక వినియోగంలో లేకుండా పోయింది. ఇక పాతపీహెచ్‌సీ భవనంలోని ఆధార్ అప్‌డేట్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన నిర్వాహకుడు కొంతసమయం మాత్రమే అందుబాటులో ఉంటున్నాడు. దీనికితోడు నెట్‌వర్క్, సర్వర్ సమస్యలతో అప్‌డేట్‌కు వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి ఉండి అనేక ఇబ్బందులు పడుతున్నారు.



గుంత చింత తీరేదెన్నడో..!



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ –నలుగుపల్లి రహదారిపైన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలమయంగా మారిన రహదారితో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 15 కిలోమీటర్లు చేరుకోవడానికి గంటన్నర సమయం పడుతుందని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదాత అరిగోస

- సాగులో ట్రాక్టర్ల వినియోగం
- కనుమరుగవుతున్న కాడెడ్లు
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- చితికిపోతున్న చిన్న రైతులు

కెరమెరి: రైతు పరిస్థితి నానాటికి దిగజారుతోంది. సాగులో యంత్రాల వినియోగం పెరగడంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. కాడెడ్ల స్థానంలో ట్రాక్టర్లు, పవర్‌ట్రిల్లర్ల వినియోగం పెరిగింది. తక్కువ సమయంలో సాగు పనులు పూర్తవుతుండడంతో రైతులంతా వీటిపైనే ఆధార పడాల్సి వస్తోంది. అయితే యంత్రాల వినియోగం ద్వారా పెట్టుబడి ఖర్చులు పెరగడం వీరికి భారంగా మారింది. సకాలంలో బ్యాంకు రుణాలు అందక చాలామంది రైతులు సాగులో వెనుకబడిపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్ యజమానులు దుక్కి దున్నేందుకు గంటకు రూ.700 నుంచి రూ.800 వరకు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేక రైతులు వారు అడిగినంతా చెల్లించాల్సి వస్తోంది. దీంతో సాగు ఖర్చులు పెరిగి చిన్నకారు రైతులు నష్టాల పాలవుతున్నారు. ఎరువులు, క్రిమిసంహారకాలు, విత్తనాల ధరలకు తోడు కూలీ రేట్లు గణనీయంగా పెరగడం వీరికి భారంగా మారింది. కెరమెరి మండలంలో 8,194 రైతులు 29,456 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

ఊరికి పదేసి ట్రాక్టర్లున్నా..

వ్యవసాయంలో యంత్రీకరణ నేడు తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా వ్యవసాయంతో పాటు అన్ని పనులకూ ట్రాక్టర్ల వినియోగం తప్పనిసరైంది. నాడు పది ఊర్లకు ఒకట్రెండు ట్రాక్టర్లుండగా.. ప్రస్తుతం ఒక్కో గ్రామంలో పదేసి ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నా చిన్నకారు రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందిస్తున్నా వీరు వాటిని కొనుగోలు చేసే పరిస్థితిలో లేరు. యాంత్రీకరణకు ముందు ఊరికి 90 శాతం మంది రైతులు కాడెడ్ల సాయంతో దుక్కులు దున్నుకోగా ప్రస్తుతం 10 శాతం కుటుంబాల్లోనూ అవి కనిపించడం లేదు.



గోయగాంలో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్

బీడు భూములుగా..

సాగు ఖర్చు నానాటికి పెరగడంతో అనేకమంది రైతులకు చెందిన భూములు బీడుగా మారుతున్నాయి. పెట్టుబడి ఖర్చులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్ అధికారులూ అనుకున్న స్థాయిలో రుణాలివ్వడం లేదు. దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఒక్కోసారి ఆశించిన దిగుబడి రాని పరిస్థితుల్లో వచ్చిన కాస్త ఆదాయం వడ్డీ వ్యాపారులకు అప్పు చెల్లించేందుకే సరిపోతోందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగు భారమవుతోంది



సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. కాడెడ్లు కొనుగోలు చేయాలంటే వాటి ధరలు చూస్తే చిన్న రైతులు కొనే పరిస్థితి లేదు. దీంతో అప్పు చేసి ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తుండగా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. గంటకు రూ.700 చెల్లిస్తున్నాం.– **సిడాం కొద్దు, రైతు, కొప్పుగూడ**

పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తేనే ఆరోగ్యంగా ఉండగలుగుతారని ఎంఈవో ఆడే ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లకు ఇచ్చిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంట గదులు శుభ్రంగా ఉంచాలని సూచించారు. రెండు నెలల క్రితమే అన్ని పాఠశాలలకు వంట పాత్రలు అందించినట్లు తెలిపారు. ఏ లోటు లేకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, భరత్‌రావు తదితరులున్నారు.

స్కూళ్లు తెరిచేరోజే యూనిఫాంలు అందించాలి

పాఠశాలల పునఃప్రారంభంరోజే విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఝరి, కెరమెరి, గోయగాం కాంప్లెక్స్‌లకు చెందిన పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూనిఫాంలు అందజేశారు. ఈ నెల 12న మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, భరత్‌రావు, సీసీ ధన్‌రాజ్, సుబ్బయ్య తదితరులున్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి

కాగజ్‌నగర్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నంబర్ 12లో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో మధ్యాహ్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వడం మానుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు చంపా, కమల, వనిత, శివాని, తనూజా, నోమిత, సావిత్రి, ఆశ, జమున, లక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల ఆందోళన



ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగిన తలోడి గ్రామస్తులు

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని తలోడి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అర్హులైన వారి పేర్లు తుది జాబితాలో లేవని ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి కవితను నిలదీశారు. గ్రామంలో 22 మంది లబ్ధిదారుల జాబితా ప్రకటించి కేవలం 14 మందికే మంజూరు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బాధితుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించారు.

తెరుచుకున్న పాఠశాల

సాక్షి ఎఫెక్ట్..



ప్రభుత్వ పాఠశాలను తిరిగి ప్రారంభిస్తున్న ఎంఈవో పవార్ అనిత, గ్రామస్తులు

నార్నూర్: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పదేళ్ల క్రితం మూతపడిన మండలంలోని కొత్తపల్లి–హెచ్ ఎస్సీగూడ ప్రభుత్వ పాఠశాలను అధికారులు మంగళవారం తిరిగి ప్రారంభించారు. పాఠశాల మూసివేతపై 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మంగళవారం ఎంఈవో పవార్ అనిత గ్రామస్తులతో కలిసి పాఠశాలను పునఃప్రారంభించారు. ఆమె సమక్షంలో 25 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఉపాధ్యాయుడు రాథోడ్ జీతేందర్ తదితరులు ఉన్నారు.

కరోనా టెస్ట్ కిట్ల కొరత!



కాగజ్‌నగర్ పట్టణంలోని సామాజిక ఆసుపత్రి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సామాజిక ఆసుపత్రిలో కరోన కిట్ల కొరత వేధిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు కరోనా టెస్టుల కోసం సామాజిక ఆసుపత్రికి వెళ్తే కిట్లు అందుబాటులో లేవని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. అయితే అక్కడ కూడా కరోనా టెస్ట్ కిట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కరోనా కిట్ల కోసం ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు రాలేదని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ కేశవ్‌రావును ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న జావిద్

బెజ్జూర్: కాగజ్‌నగర్ వంజిరి సమీపంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండల కేంద్రానికి చెందిన జావిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై జావిద్ వెళ్తుండగా కాగజ్‌నగర్ వంజిరి సమీపంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడి కాలుకు తీవ్ర గాయాలైనట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

నార్నూర్: కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గాదిగూడ మండలం కుండిశేకుగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు లేదని, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సక్కు, భీంరావు, పర్శురాం పటేల్, బాదిరావు, నాగోరావు, ఆనందరావు, రాజు, సీతారాం ఉన్నారు.

మెరుగైన విద్యనందిస్తాం

కెరమెరి: విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తామని జైనూర్ ఏటీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిన్నసాకడ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గిరిజన విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, నాణ్యమైన భోజనం, చక్కటి వసతి అందిస్తూ ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన కొనసాగిస్తున్నామని చెప్పారు. బడీడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించాలని కోరారు. కొత్తగూడ గ్రామలో మూతబడిన పాఠశాలను తెరిపించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలు వాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, గ్రామ పెద్దలు పెందోర్ ఆనంద్‌రావు, శ్యాంరావు, పెందోర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు జంగు, మోతీరాం, శ్రీనివాస్, సుజాత తదితరులున్నారు.

ఆత్మగౌరవం కోసం ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుండా థామస్

రెబ్బెన: మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాలతో ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, అదే స్ఫూర్తితో ఆత్మగౌరవం, సమానత్వాన్ని కాపాడుకునేందుకు నాయకులు ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ కోరారు. మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీలోగల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు వేయాలని, ప్రతీ మాదిగ పల్లెలో జెండా గద్దెలు నిర్మించుకుని జూలై 7న దండోరా జెండాలు ఎగురవేయాలని సూచించారు. మండల ఇన్‌చార్జి కొత్రాళ్ల రాజేందర్, కోఇన్‌చార్జి గోగర్ల రాజేశ్, గోగర్ల రాజు, వేమునూరి వెంకటేశ్వర్లు, ఇప్ప వెంకటి, మండల మహిళా ఇన్‌చార్జి వడ్డూరి రాజేశ్వరి, సీనియర్ నాయకులు గోపాలకృష్ణ, లింగంపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రతం



రావిచెట్టుకు దారం చుడుతున్న మహిళలు

కెరమెరి: వటసావిత్రి వ్రతాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వివిధ వాడలకు చెందిన మహిళలు మంగళవారం శివాలయానికి తరలివచ్చారు. రావి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నవధాన్యాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ రావి చెట్టు వద్ద కలశపూజ నిర్వహించారు. మంగళహారతులిచ్చారు. వటసావిత్రి వ్రత ప్రాముఖ్యాన్ని కథ రూపంలో వివరించారు.